ఓం నమో భగవతే శ్రీరమణాయ

# రమణభాస్కర

## (మహదేవపట్నంలో శ్రీనాన్నగారి ప్రవచనము, 16-9-96)

ప్రియమైన ఆత్మ బంధువుల్లారా,

సమాధిస్థితి సహజస్థితి. ఇప్పుడు మనం ఏ స్థితిలో ఉన్నామో అది అసహజస్థితి. కాని మనం సమాధిస్థితిని అసహజస్థితి అనుకొంటున్నాము. అహంకారబుద్ధితో జీవించే స్థితిని సహజస్థితి అనుకొంటున్నాము. సమదృష్టి కలిగినపుడు మనకు సమాధిస్థితి కలుగుతుంది. అంతానేనే అని అనుకోవటం వలన సమాధిస్థితి కలగటానికి ఆ భావన ఎంతో మనకు సహకరిస్తుంది. సమానదృష్టిని అభివృద్ధి చేసుకొంటే మీకు సమాధిస్థితి కలుగుతుంది. పూజ, జపం, ధ్యానం ఇవి అన్నీ దేనిని అందుకోవటం కోసం చేస్తున్నామో ఆమోక్షస్థితి మీ హృదయంలోనే ఉంది. అది ఉందా, లేదా అని సందేహపడకండి. మీ హృదయంలో సహజముగా ఉన్నస్థితిని పొందటానికి మీకు ఆటంకముగా వచ్చే విషయప్రవృత్తిని తొలగించుకోవాలి. మీ మనస్సు పల్చబడేటట్లు చూసుకోండి. మీమనస్సు ఎంత పల్చగా ఉంటే, ఎంత ఏకాగ్రంగా ఉంటే, ఎంత పవిత్రంగా ఉంటే అంత తొందరగా అంతర్ముఖమవుతుంది. ఏ వస్తువుకోసం అయితే అన్వేషిస్తున్నారో ఆ వస్తువు ఎక్కడో మీకు దూరానలేదు. మీ దేహంకంటే, మీ మనస్సుకంటే అత్యంత సమీపంగా మీ హృదయంలోనే ఉంది. అది పొందితే మీరు సుఖపడతారు. ఆ వస్తువు ఉందా, లేదా అనే అనుమానానికి మాత్రం అవకాశం ఇవ్వకండి. మీ అనుమానమే మీ మనస్సు అంతర్ముఖం అవ్వటానికి అడ్డువస్తుంది. ఆ వస్తువుసదా ఉంది. నీ దేహంయొక్క పుట్టుక, చావులతో సంబంధం లేకుండా ఆవస్తువు తనంతట తానుగా ప్రకాశిస్తోంది. నీవు ఎప్పుడు తెలుసుకొంటావా అని నీకోసం ఎదురుచూస్తోంది. ద్వైతబుద్ధి ఎప్పుడయితే నశించిందో అప్పుడు నీకు నిజమైన స్వరాజ్యం వస్తుంది. అందువలన సాధన చేసి ద్వైతబుద్ధిని నశింపజేసుకో.

బాహ్యమైన చదువువలనగాని, ధనంవలనగాని, కీర్తివలనగాని నీ మనస్సు అంతర్ముఖం అవ్వదు. నీ మనస్సుకు ఏకాగ్రత, పవిత్రత చేకూర్చటం వలన అది అంతర్ముఖం అవుతుంది. వ్యక్తిభావన పెంచుకోకుండా పనిచేయటం నేర్చుకోవాలి. వ్యక్తిభావన నశించటానికి అనుగుణంగా నీవు ఏ పని చేసినా అది పనికాదు అది యోగం అవుతుంది. అప్పుడు భగవదనుభవం పొందటానికి నీకు ఏ మానసికవృత్తి అయితే అడ్డువస్తోందో అది నశిస్తుంది. అందువలన పని పనిలాగ చేయవద్దు, యోగంలాగ చేయండి. అహంకారము లేకుండా చేసే కర్మ అంతా అకర్మ అవుతుంది. అప్పుడు నీవు పని చేసినా చెయ్యనివాడితో సమానము. ఆ పని నిన్ను చుట్టుకోదు. రాబోయేజన్మకు కారణంకాదు. అహంకారముతో సంబంధం లేకుండా ఆ వస్తువు ఉంది. మనం చేసే తప్పు ఏమిటి అంటే అహంకారము విడిచిపెట్టకుండా అహంకారముతో ఆవస్తువును పొందటానికి ప్రయత్నం చేస్తున్నాము. అందుచేత ఆ వస్తువును పొందే అవకాశం లేదు.

మనం ఏదైతే నిజం అనుకొంటున్నామో అవి అన్నీ జడవస్తువులు. నీ దేహం, ఇంద్రియాలు, మనస్సు, ప్రాణం ఇవి అన్నీ కూడా జడవస్తువులే. వీటితో ఇసుమంతయు సంబంధం లేకుండా బ్రహ్మం తనంతట తానుగా ప్రకాశిస్తోంది. దానిని తెలుసుకొంటే సుఖపడతావు. తెలియకపోతే జన్మజన్మలకు దుఃఖం నిన్ను వెంటాడుతుంది. మన అహంకారమే మనలను చీకటిలోకాలకు తీసుకొని వెళుతుంది. మనం చీకటి లోకాలకు వెళ్ళటానికి ఏ అహంకారం అయితే కారణమో దానిని ఇప్పుడే ఇక్కడే తొలగించుకొంటే నీకు బ్రహ్మానుభవం

కలుగుతుంది. నీ దుఃఖానికి కారణం ఎక్కడో బయటలేదు. నీలోపలే ఉంది. నీ దుఃఖానికి కారణం వ్యక్తిభావన, కర్తృత్వభావన. ఇది ఉన్నంతసేపు బాహ్యంగా నీకు ఎన్ని సంపదలు ఉన్నప్పటికి దుఃఖం నిన్ను విడిచిపెట్టదు. ఈ వ్యక్తిభావన నశిస్తే నీవు పోవు. నువ్వు ఎవరివో నీకు తెలుస్తుంది. నీవు ఎవరో నీకు తెలిసిన వెంటనే అక్కడ ఉన్నది శాంతే, అక్కడ ఉన్నది సుఖమే. అది అభవసుఖం, అవ్యయసుఖం, పూర్ణసుఖం. ఎంత అనుభవించినప్పటికీ అదివ్యయంకాదు. అప్పుడు సుఖం కోసం, శాంతికోసం ఈ ప్రపంచం మీద ఆధారపడి ఉండనక్కరలేదు. ఏదేహము, మనస్సు, లోకముతో నీవు తాదాప్యం పొందుతున్నావో అవి మూడు కేవలం నీడలు మాత్రమే. ఇది ఇప్పుడు నీకు అర్థం కాకపోవచ్చు. రాబోయేతరం అయినా అర్థం చేసుకొంటుంది అని Subject చెప్పి ఉంచుతున్నారు. నువ్వు నిజంకాని దానిని నిజం అనుకొంటున్నావు. ఇవి అన్నీ కేవలము నీడలేకాని నీ అహంకారబుద్ధి వలన ఇవి అన్నీ నిజంవలె నీకు కనిపిస్తున్నాయి. నీవు ఆత్మవే. కాని నీవు దేహాన్ని ఆత్మగా భావిస్తున్నావు. ఏదైతే ఆత్మకాదో దానిని ఆత్మగా భావిస్తున్నావు అదే నీ అశాంతికి కారణము.

అంతా భగవంతుడిదే. ఈ సృష్టిలో మనది అంటూ ఏమీలేదు అంతా ఆయనదే. కాని ఇందులో కొంత మనది అనుకొని ఇది అంతా నేను దేవునికి ఇచ్చేస్తున్నాను అనుకొంటాడు. వాడు శుద్ధ అహంకారి. వాడు అహంకారి కాబట్టే ఇది నాది అనుకొంటున్నాడు దానిని దేవునికి ఇచ్చేస్తున్నాను అనుకొంటున్నాడు. ఇది అంతా అహంకారము యొక్క లక్షణమే. నేనునాది, నాది నేను అనుకోవడం అజ్ఞానం. నీది నీవు, నీవు నీది అనుకోవడం జ్ఞానం అని రామకృష్ణుడు చెప్పాడు. మీకు జ్ఞానం ఉందో, అజ్ఞానం ఉందో ఎవరిమటుకు వారు పరిశీలన చేసుకోండి అని చెప్పాడు. నీ లోపల అహంకారం ఉన్నంతకాలం అది విజృంభిస్తూనే ఉంటుంది. అది విజృంభిస్తే విజృంభిస్తుంది కాని నీవు దానిని లెక్క చేయకు, దానిని గమనించవద్దు, నీ మొఖం అంటు త్రిప్పవద్దు, దానికి నీరు పోయవద్దు అప్పుడు కృశించి రాలిపోతుంది అని చెప్పారు. పుట్టమీద ఎన్ని దెబ్బలు కొట్టినా లోపల ఉన్న పాము చావదు. పాముతలమీద కొట్టాలి. ఈ నేను అనే మొదటి తలంపే అహంకారానికి తలలాంటింది. భగవాన్ చెప్పే మాటలు అన్నీ అహంకారము అనే సర్పం తలమీద మొట్టికాయలు పడుతూ ఉంటాయి. దేహగతమైన నేనును ఎప్పుడయితే తొలగించుకొన్నావో నీ హృదయంలో ఉన్న బ్రహ్మం నీకు నేనుగా వ్యక్తమవుతుంది. నీ హృదయంలో ఉన్న శాంతి పదవిని పొందటానికి ప్రయత్నం చెయ్యి. అది శాశ్వతంగా ఉంటుంది. మిగిలినవన్నీ స్వప్న సమానమే. మీకు చేతనయితే మంచి మాట్లాడండి. లేకపోతే నోరు మూసుకొని కూర్చోండి. అసందర్భపు మాటలు మాట్లాడి వాతావరణాన్ని పాడుచేయవద్దు. మీకు శాంతి లేకపోతే అలాపడి ఉండండి. అంతేగాని ఇతరుల శాంతిని పాడుచేయవద్దు. భయం లేకుండా ఉండండి అప్పుడు లోపల ఉన్న బ్రహ్మం మీకు వ్యక్తమవుతుంది. ధైర్యం లేనిమనుషులకు, ఓర్పులేని మనుషులకు లోపల ఉన్న పరమేశ్వరుడు వ్యక్తం కాడు.

నేను అనే తలంపు నీకు లోపలనుండి వస్తోంది. దాని సోర్సు నీలోపలే ఉంది. అందువలన విచారణ లోపల చెయ్యి. లోపల విచారణచేస్తే ఈ జన్మలో కాకపోయినా మరో జన్మలో అయినా ఆ సోర్సు నీకు తెలుస్తుంది. విచారణ చేయగా చేయగా, ధ్యానం చేయగా చేయగా నీవు చేసిన కృషి వలన, దైవానుగ్రహం వలన దాని సోర్సు నీకు తెలియబడుతుంది. అది తెలిసిన వెంటనే నీవు ఊహించని సుఖం, శాంతి నీకు అనుభవంలోనికి వస్తాయి. మీరు బయట ఉన్న ఋషులను చూస్తున్నారు. నిజమైన ఋషి నీ హృదయంలో ఉన్నాడు. నీ హృదయంలో ఉన్న నిజమైన ఋషిని ప్రత్యక్షం చేసుకొంటే శాంతి ప్రవాహం వచ్చి నీ సహస్రారమును ముంచి వేస్తుంది. నీ మనస్సులోని గొడవలను లెక్కపెట్టుకొని నువ్వు అశాంతికి గురికావద్దు. మనస్సు నీవు కాదు. అందుచేత ఆత్మను అన్వేషించు. నీ హృదయంలో ఉన్న ఈశ్వరుడిని వెదకటానికి

ప్రయత్నం చేస్తూ ఉంటే నీ మనస్సు పత్తాలేకుండా పోతుంది. ఎప్పుడైతే నీవు భగవంతుని తెలుసుకోవటానికి ప్రయత్నం చేస్తున్నావో అప్పుడు నీకు తెలియకుండానే అహంకారబుద్ధికి దూరమవుతావు.

భయము, ద్వేషము, అసూయ నీకు వచ్చే కష్టము, సుఖము ఇవి అన్నీకూడా తలంపులే. నేను అనే ప్రధాన తలంపు వచ్చాక ఇవి అన్నీ వస్తున్నాయి. ఈ తలంపులలో నుండి విడుదల పొందటమే యోగం యొక్క లక్ష్యం. ఏది వచ్చినా తరువాత మిగిలిన గొడవలు అన్నీ వస్తున్నాయో మనం చూసుకోవటం లేదు. ఆ గొడవలు పట్టుకొని వ్రేలాడుతున్నాము గాని దానివలనే ఈ గొడవలు వస్తున్నాయి అని ఆ మూల తలంపును పట్టుకోలేకపోతున్నాము. దేహగతమైన నేను వచ్చాక మిగిలిన గొడవలు వస్తున్నాయి. దేహగతమైన నేను వచ్చాక ఈ గొడవలు వస్తున్నాయి కదా. అది ఎవరో విచారణ చేద్దాము అనే బుద్ధి మనకు కలగటం లేదు. మాయ అంతా దేహగతమైన నేనులో పెట్టాడు. ఆ నేనును విచారణ చేయటంలేదు అందువలన మాయలో నుండి బయటకు రాలేకపోతున్నాము. ఈ నేను నశిస్తే మాయ నశిస్తుంది. నువ్వు ఏ యోగం ద్వారా ప్రయాణంచేసినప్పటికి ఆ నేను అనే తలంపును పరిష్కారం చేసుకోవాలి. అది నీస్వంత సమస్య. ఆ సమస్యను పరిష్కారం చేసుకోకపోతే ఈశ్వర సాక్షాత్కారం లేదు నీకు గతిలేదు. భగవంతుడు మీకు ఏమన్నా అవకాశములు ఇస్తే వాటిని సద్వినియోగం చేసుకొని జ్ఞానసింహాసనం మీద కూర్చోవటానికి ప్రయత్నం చేయండి. చిన్న విషయాలకు కంగారుపడకండి. విరామసమయాన్ని పాడుచేసుకోవద్దు. మీరు విరామకాలాన్ని ఎంత బాగా సద్వినియోగం చేసుకొంటే అంత తొందరగా జ్ఞానం వచ్చి మిమ్మల్ని వరిస్తుంది. ఎందుచేతనంటే భగవంతుడు కాలరూపంలో ఉన్నాడు. కాలాన్ని సద్వినియోగం చేసుకొంటున్నాడు అని ఆనందించి ఆయన అనుగ్రహం పొంగి మీ ఎరుక లేకుండానే ఈ జన్మలోనే ఇప్పుడే ఇక్కడే ఆయన స్వరూపాన్ని ఇస్తాడు.

ఎదుటివారు ఏమన్నా చెపితే ఎంతవరకు మన క్షేమంకోరి చెపుతున్నారు అని ఆలోచించుకోండి. చెప్పుడు మాటలు బుజానవేసుకొని తిరగవద్దు. స్వతంత్రముగా జీవించండి, ఆలోచించుకోండి. మీకాళ్ళమీద మీరు నిలబడండి. అప్పుడు స్వతంత్రముగా ఉన్న వస్తువు నీకు వ్యక్తమవుతుంది. శరీరానికి ఆత్మకు అణు మాత్రంకూడా సంబంధంలేదు. అహంకారానికి శరీరానికి సంబంధం ఉంది. ఆత్మ ఎలా ఉంటుంది అని ఊహించటం కంటే ఆత్మ అవ్వటానికి ప్రయత్నం చేయండి. నీవు ఊహించటం మొదలుపెడితే నీ మనస్సు వెళ్ళి అక్కడ కూర్చొంటుంది, లేనిపోని గొడవలు, అనుమానాలు లేవదీస్తుంది. జ్ఞాని అంటే బ్రహ్మమును తెలుసుకొన్నవాడు. జ్ఞానికి ఒక శరీరం ఉన్నట్లు కనిపించినా కూడా వాడు అశరీరుడే. అహంకారములో మీరు వేరు, నేను వేరు కాని హృదయంలో అందరూ ఒకటిగానే ఉన్నాము. నీవుదేనితోటి తాదాప్యం పొంద వద్దు. ఒక రూపంతోటిగాని, ఒక నామంతోటిగాని, ఒక ప్రాంతంతోగాని ఇలాదేనితోటి తాదాప్యం పొందినా అది అజ్ఞానం యొక్క లక్షణం. నీ మనస్సులో ఎన్నిరకాల గొడవలు, ఆలోచనలు ఉన్నా అవి తలంపులు కలుగజేస్తున్నాయి. రవ్వంత, ముల్లంత ఆలోచించి చూస్తే ఈ విషయం మీకే అవగాహన అవుతుంది.

భగవాన్ మౌనస్వరూపుడు. మాటలు చాలా తక్కువ మాట్లాడేవారు. ఆయన మౌనసందేశం ఎదుటివారి హృదయానికి అర్థమయినపుడు వారు మాటలతో పని లేకుండానే వెళ్ళిపోయేవారు. అటువంటి వారిగురించి వారికే వారు పండినపండులాంటివారు, వారికి మాటలతో పనిలేదు అనేవారు భగవాన్. అర్థం చేసుకోకుండా వెళ్ళిపోతే వారు వచ్చినారు, వెళ్ళినారు అనేవారు ఎక్కువ మౌనంతో చెప్పేవారు. మౌనం అర్థంకానపుడు నోరు విప్పేవారు. ఆయన మౌనంగా బోధించినా, మాట్లాడినా, చూసినా అనుగ్రహమే. అనుగ్రహం తప్పించి మరొకటిలేదు. మన చైతన్యస్థాయిని పెంచటం కోసం గురువు పడేకష్టం మనకళ్ళకు కనబడదు. ఆ కష్టం మనకు కనబడాలి అని గురువు అనుకోడు.

## (భీమవరంలో శ్రీనాన్నగారి ప్రవచనము, 11-9-96)

గాఢనిద్రలోనుండి జాగ్రదావస్థలోనికి రాగానే మనకు మొదటి నేను అనే తలంపు వస్తుంది. అన్ని అరిష్టాలకు, అశాంతికి ఈ నేను అనే మొదటి తలంపే కారణం. ఈ నేను అనే మూలతలంపును పరిష్కారం చేసుకోకపోతే ఈ దేహం, ప్రకృతిగుణాలు, అజ్ఞానం, జననమరణాల నుండి నీవు వేరు పడలేవు. ఈ నేను లేదని ఎవరూ చెప్పరు. నేను ఉన్నానని నీకు ప్రత్యక్షంగా తెలుస్తోంది. ఆ నేను ఎవరో ఆ నేను అనే మొదటి తలంపు యొక్క మూలం ఏమిటో మనకు తెలియటం లేదు. ఆ నేను అనే మొదటి తలంపు యొక్క మూలంలోనే దేవుడు ఉన్నాడు. సముద్రానికి బుడగకు ఎటువంటి సంబంధం ఉందో నీ హృదయంలో ఉన్న చైతన్యానికి, ఈ నేను తలంపుకు అటువంటి సంబంధం ఉంది. నా హృదయంలో ఉన్నది సముద్రం. ఈ నేను అనే తలంపు ఆ సముద్రం నుండి వచ్చిన బుడగ మాత్రమే. ఈ బుడగ పోతుంది అని నీవు కంగారు పడకు. ఈ బుడక పోతే నీవు సముద్రం అయిపోతావు. నేను అనే తలంపును విచారణచేసి ఆ నేను అనే తలంపు యొక్క మూలాన్ని అన్వేషించగలిగితే నువ్వు పోవు నువ్వు ఎవడివో నీకు తెలియబడుతుంది. రమణమహర్షి మిమ్మల్ని సంతృప్తి పరచటానికి మాటలు చెప్పలేదు. ఈ జీవుడిని ఏదో పద్ధతిలో సత్యం దగ్గరకు తీసుకొని వెళ్ళటానికి ప్రయత్నం చేసాడు.

మీరు పూజలు, జపాలు, ధ్యానాలు, యజ్ఞాలు చేస్తున్నారు. నీవు ఏ మార్గంలో ప్రయాణించినా అక్కడ నేను ఉంది. నీ మానసిక ప్రవృత్తినిబట్టి నీవు ఏమార్గంలో ప్రయాణించినా ఈ నేనును పరిష్కరించుకోవలసినదే. శరీరం చనిపోయినపుడు నేను చనిపోతున్నాను అని శరీరం అనటంలేదు. ఈ నేనే అంటోంది. ఈ దేహం నాది అనుకోవటం వలన, దేహంతో తాదాప్యం చెందటంవలన దేహం చనిపోయినపుడు నేను చనిపోతున్నాను అని ఈ నేనే చెపుతోంది. చనిపోవటం, పుట్టటం ఇవి అన్నీ తలంపులే. దేహానికి సంబంధించి, దైవానికి సంబంధించి వచ్చే తలంపులు, ద్వైతం, అద్వైతం ఈ సిద్ధాంతాలు ఇవి అన్నీకూడా నేను అనే తలంపు వచ్చాక వస్తున్నాయి చివరకు నీ ఓంకారము కూడా నేను అనే తలంపు వచ్చిన తరువాత వస్తోంది. దేవుడు కంటే, ఈ సిద్ధాంతాలకంటే, నీ దేహం కంటే, నీ ఇష్టదేవత కంటే అన్నింటికంటే ఈ నేను అనే తలంపు నీకు అత్యంత సమీపంగా ఉంది. ఇది కాదు అనేవారు ఎవరైనా ఉన్నారా?

నాకు దేవుడిని తెలుసుకోవాలి అని ఉంది అని ఒక భక్తుడు భగవాన్‌తో అన్నాడు. దేవుడు వచ్చి నిన్ను అడిగాడా తెలుసుకోమని అన్నారు భగవాన్. ఆయన నన్ను ఎప్పుడూ అడగలేదు అని చెప్పాడు. నిన్ను అడగనిదానికి ఆయన గొడవ నీకు ఎందుకు. నీ గొడవ ఏదో నీవు చూసుకో అన్నారు భగవాన్. దేవుడు లేడు అనుకో ఏ గొడవలేదు. నిజంగా దేవుడు ఉన్నాడు అనుకో నీ అవసరం వాడికి లేదు అని చెప్పారు. దేవుడు ఉన్నాడు అని చెప్పేవాడు ఈ నేనే. దేవుడులేడు అని చెప్పేవాడు ఈ నేనే. దేవుడు ఉన్నాడు, లేడు అనేది ఈ నేను అనే తలంపు వచ్చాకే ఈ సమస్య వస్తోంది. ఈ నేను ఎవడను? అనే ప్రశ్న మనం ఎవరిమో మనం తెలుసుకోవటానికి ఉపయోగపడుతుంది. ఇది సూటి ప్రశ్నేకాదు ఇది సూటి విచారణ. పైకి అది ప్రశ్నలాగ కనబడుతోంది. దాని అంతర్భాగములో చూస్తే అది విచారణ. నేను అనే ప్రథమ తలంపును వెంటాడుతూ హృదయంయొక్క లోతులలోనికి, లోయలలోనికి నీవు వెళుతూ ఉంటే అది దాని మూలంలోనికి కూరుకొని పోయి అది నాశనం అవుతుంది. సర్వ అరిష్టాలకు కారణం అయిన ఈ నేనును మినహాయింపులు లేకుండా ఈశ్వరునికి సమర్పించుకో. లేనిచో విచారణ చేసి ఈ నేను అనే మొదటి తలంపులోనుండి బయటపడు. ఒక చిన్న ప్రయత్నం చేయి. తరువాత గురువు, ఈశ్వరుడు చూసుకొంటాడు. నీవు చేసే పని శ్రద్ధగా భక్తిగా చేస్తే ఈశ్వరుడు నిన్ను అనుగ్రహించి ఆయన స్వరూపాన్ని ఇస్తాడు.